క్లుప్తంగా

బాలుడికి రక్తదానం

పోరుమామిళ్ల : కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన చక్రవర్తి (11) అను బాలుడు అనారోగ్యంతో పోరుమామిళ్లలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు అతనికి 3 శాతం రక్తం మాత్రమే ఉందని, ఏ పాజిటివ్ రక్తం కావాలని చెప్పారు. సోమవారం బాలుని బంధువులు రక్తం కోసం ప్రయత్నించి లభించకపోవడంతో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్‌రసూల్‌ను కలిశారు. ఆయనది అదే గ్రూపు రక్తం కావడంతో రక్తదానం చేశారు.

అంగన్‌వాడీల ధర్నా



ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ప్రొద్దుటూరు: అంగన్‌వాడీ కేంద్రాలను విభజించకుండా యథావిధిగా కొనసాగించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను రీ ఆర్గనైజేషన్ చేయడం ద్వారా అనేక రకాల సమస్యలు వస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా విలీనం చేసిన సెక్టార్లను యథావిధిగా పరగణించారని, ప్రొద్దుటూరులో మాత్రమే రెండు సెక్టార్లను విచ్ఛిన్నం చేసి విలీనం చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి హాజరు కాగా, ముద్దనూరు, చాపాడు, కమలాపురం ప్రాజెక్టులకు సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం



పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేటలోని పంపింగ్ స్టేషన్ నుంచి టీబీ రోడ్డులో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోయింది. 350 ఎంఎం డయా ఏసీ పంపింగ్ లైన్ పగిలిపోయి నీరు వృధా పోతుండటంతో సోమవారం మున్సిపల్ అధికారులు పనులు ప్రారంభించారు. పైపులైన్ మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ వెకటరమణయ్య పరిశీలించారు. పైపులైన్ మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో మంగళవారం నీటి సరఫరా ఉండదని కమిషనర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీపీఐ బస్సు జాతాను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 16 నుంచి చేపట్టనున్న సీపీఐ బస్సు జాతాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. సోమవారం ఆయన సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఉద్యోగ వాటాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు శివారెడ్డి, శ్రీను, చంద్రశేఖర్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవరుచుకోవాలి

పులివెందుల రూరల్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలని జేఎన్‌టీయూ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

జమ్మలమడుగు: ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా విజయ చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికై నందుకు రెవెన్యూ ఉద్యోగుల సంఘం సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గురప్ప ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం విజయ్ చైతన్య మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ అధికారుల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంపై ఎన్నుకున్నందుకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీ వేణుగోపాల్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భీమన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అర్హతల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 19, 23 వార్డు సచివాలయాలకు సంబంధించి సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా అత్యంత సులువుగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. వివిధ కారణాల వల్ల ఇంకా అర్హత ఉండి పథకాలు రానివారు ఉంటే ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష వరకు మంజూరు చేసి ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించేందకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతకుంట సరిత జయలింగారెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చాను మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాజుపాళెం : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ అన్నారు. మండలంలోని గాదెగూడూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం నాయకుడు వెంకటరెడ్డి, ఎంఎస్ఓ, ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ ఇందిరారాణి లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథ రెడ్డి, ఈఓపీఆర్డీ ఆలీఖాన్, ఏఓ శివరామ కృష్ణారెడ్డి, ఏపీఓ గంగయ్య పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు రక్ష

బద్వేలు అర్బన్ : అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేని వారికి లబ్ధిని చేకూర్చడంతో పాటు 11 రకాల సేవలను ఉచితంగా అందించే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు రక్ష లాంటిదని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దూదేకుల వీధి సచివాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా 98 శాతం మందికి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. సాంకేతిక కారణాల వలనో, ఇతర కారణాల వలనో ఆ 2 శాతం మంది కూడా పథకాలు అందలేదనే మాట ఉండకూడదన్న ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. గతంలో మాదిరిగా ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా దరఖాస్తు చేసుకున్న ఒక్క రోజులోనే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గానుగపెంట సమత, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జి రమేష్‌బాబు, మున్సిపల్ ఆర్ఐ ఖాజాహుస్సేన్, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

అట్లూరు : సమస్యల సత్వర పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని కొండూరు సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో 11 రకాల ధృవీకరణపత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామకృష్ణయ్య, ఎంఈఓ విలియంరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, సర్పంచ్ సుధామయి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

కలసపాడు : జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం జరుగుతుందని మండల స్పెషలాఫీసర్ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెన్నుపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే ద్వారా 106 మందిని గుర్తించి 108 మందికి వివిధ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు సంతృప్తికర రీతిలో పరిష్కారం చూపడంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, గృహసారథుల మండల కన్వీనర్ చిత్తారాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.విజయభాస్కర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ మురారి, సర్పంచ్ నవీన్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్ : లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి



రాజుపాళెం: గాదెగూడూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న అధికారులు



అట్లూరు : ధ్రువీకరణపత్రాలను అందజేస్తున్న తహసీల్దారు శ్రీవాణి



చెన్నుపల్లెలో లబ్ధిదారురాలికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా అనఘాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి ఉత్సవ మూర్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో అనఘాష్టమి సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. సోమవారం వేకువజామున అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. దత్తాత్రేయ స్వామి, అనఘాదేవిలకు ప్రత్యేక పూజలు చేసి అమ్మ వారికి ఒడిబియ్యం కట్టారు. స్వామి, అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. శ్రీపాద వల్లభ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. అర్చకులు రామానుజాచార్యులు, వాసు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రొద్దుటూరుకు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాక

ప్రొద్దుటూరు : రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి ప్రొద్దుటూరు మండలానికి మంగళవారం రానున్నట్లు సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సప్లయికి సంబంధించిన వాటిని పరిశీలంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఓపెన్ ఫోరం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులతోపాటు సంబంధిత అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు సురక్షితం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుస్మిత



గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు కావడం ఎంతో సురక్షితమని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం గర్భిణులకు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ సుస్మిత వైద్య పరీక్షలు నిర్వహించారు. హై రిస్కు ఉన్న వారికి సురక్షిత కాన్పు కోసం పలు సూచనలు ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఫార్మసిస్టు శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, స్టాఫ్ నర్సులు, పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బి.కోడూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. సోమవారం పీహెచ్‌సీలో వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 10 మంది గర్భిణులు, ఐదుగురు బాలింతలకు రక్తపరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఎత్తు, బరువు, హెచ్ఐవీ పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు. పోషకాలు కలిగిన ఆకుకూరలు, ఖనిజ లవణాలు, క్రొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, మాంసకృత్తులు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తెలిపారు. బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి, ఆరోగ్య పర్యవేక్షకులు విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, పబ్లిక్ హెల్త్‌నర్సు పుష్పాంజలి, వైద్య సిబ్బంది రామచంద్ర, రాజమ్మ, రామతీర్థం, విజయలక్ష్మి, వేదవతి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

నేడు నరసాపురంలో జగనన్న సురక్ష

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ మైథిలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు గుర్తించిన వారికి 11 రకాల సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీ.సండ్రపల్లెలో..

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లె సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ప్రత్యేకాధికారితో పాటు అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు. అలాగే అర్హులైన వారికి 11 రకాల ధ్రువీకరణపత్రాలను ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. టీ.సండ్రపల్లె, ఎస్.రామాపురం గ్రామ పంచాయతీల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం

వేముల : మండలంలోని దుగ్గన్నగారిపల్లె గ్రామానికి చెందిన వడ్డెమాని గురుప్రతాప్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. ఈయన వరంగల్ నిట్ కళాశాలకు చెందిన సివిల్ డిపార్ట్‌మెంట్ ఫ్యామిలీ డాక్టర్ తేజస్వి, ప్రొఫెసర్ రతీష్‌కుమార్ పర్యవేక్షణలో 'కండిషన్ అసెస్‌మెంట్ అండ్ సర్వీస్ లైఫ్ ఎస్టిమేషన్ ఆఫ్ టేరియర్టింగ్ కాంక్రీట్ యూసింగ్ ఇమేజ్ బెస్ట్ అనాలసిస్' అనే అంశంపై 13 పరిశోధనా పత్రాలు ప్రచురించడం విశేషం.

భద్రాచలం రామస్వామికి రామకోటి పుస్తకాలు



రామకోటి పుస్తకాలు ప్యాక్ చేస్తున్న మహిళలు

పోరుమామిళ్ల : రెండు నెలలుగా భక్తులు రాసిన రామకోటి పుస్తకాలు ఈ నెల 20న భద్రాచలం తీసుకెళ్లి రాములోరి సన్నిధిలో ఇస్తామని పుస్తక ప్రచురణకర్త శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా నాగేంద్రరెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, సురేష్, బాలుడుల మిత్రబృందంతో రామకోటి పుస్తకాలు ప్రచురించి భక్తులకు అందించామన్నారు. భక్తులు రామకోటి రాయడం పూర్తయిందని, సోమవారం ఆ పుస్తకాలను శుభ్రపరచి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి గుడిలో కాషాయవస్త్రంలో మహిళలు మంజుల, చంద్రమ్మ, వీరమ్మ, సుబ్బమ్మ, సుబ్బలక్షుమ్మ ప్యాక్ చేశారన్నారు. ఈ పుస్తకాలను భద్రాచల ఆలయంలో అప్పగిస్తామన్నారు.

పంటల బీమాతో రైతులకు ఊరట



మాట్లాడుతున్న ఏఓ మధుసూదన్‌రెడ్డి

తొండూరు : గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి దెబ్బతిన్న రైతులకు పంటల బీమా మంజూరు చేశారని.. దీంతో చాలామంది రైతులకు ఊరట కలిగిందని ఎంపీపీ నారాయణమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ నారాయణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అలాగే మండల వ్యవసాయాధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు 5రకాల పంటలకు పంటల బీమా మంజూరు చేయడంపై ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో దాదాపు 7900మంది రైతులకుగానూ రూ.4కోట్ల మేర పంటల బీమా మంజూరైందని వెల్లడించారు. అలాగే అర్హులై ఉండి పంటల బీమా అందని రైతులు ఉంటే తమ దృష్టికి వస్తే సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, పీఆర్ ఇంజనీర్ లక్ష్మినారాయణరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు ఓబులేసు, విజయ్‌శంకర్, కో–ఆప్షన్ మెంబర్ ప్రకాష్‌రావు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినతి



మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవికి వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్యలకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్ మాట్లాడుతూ జీఓ 25 ప్రకారం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు ప్రమాదం వల్ల చనిపోతే రూ.5లక్షలు, సాధారణంగా మరణిస్తే రూ.2 లక్షలు ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలో ఐదు మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు సాధారణంగా మృతి చెందారని, వారికి ఆ జీఓ ప్రకారం రావాల్సిన రూ.2లక్షలు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు, యూనిఫాం ఇవ్వాలని, కార్మికులకు పర్సనల్ రుణాలు ఇప్పించాలని కోరినట్లు తెలిపారు.యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, కోశాధికారి రాఘవేంద్ర, రమాదేవి, అన్నపూర్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాట్ల పనులు పరిశీలన

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం ఆవరణలో దివంగత సీఎం డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాట్లు పనులు త్వరగా పూర్తి చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం విగ్రహ ఏర్పాటు పనులతో పాటు మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యర్రగుంట్ల వాసి, సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి దాతృత్వంతో వైఎస్సార్ విగ్రహంను అత్యంత సుందరీకరణంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విగ్రహం ఏర్పాటుకు పౌండేషన్ అయిందన్నారు. చుట్టు ప్రహరీతో పాటు గ్రీనరీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెలలోనే విగ్రహ ప్రారంభోత్సవంతోపాటు, మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ భవనంను ప్రారంభిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డితో పాటు కో–ఆప్షన్ సభ్యులు డి సూర్యనారాయణ రెడ్డి, కౌన్సిలర్ ఎరిలకరెడ్డి, యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, పార్టీ నాయకులు డి గంగాక్రిష్ణారెడ్డి, కేవి సుబ్బారెడ్డి, రాజారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వై విశ్వభార్గవరెడ్డి పాల్గొన్నారు.

అనుమతిలేని మందులు విక్రయిస్తే చర్యలు

ముద్దనూరు: అనుమతిలేని పురుగుమందులు, ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భూసంరక్షణ విభాగం ఏడీఏ అనిత హెచ్చరించారు.సోమవారం స్థానిక ఏఓ వెంకట కృష్ణారెడ్డితో కలిసి ఏడీఏ పురుగుమందుల, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పలూరులో, ముద్దనూరులో సరైన పత్రాలు లేకుండా విక్రయిస్తున్న రూ.46వేలు, రూ.1లక్షా6వేల విలువ చేసే ఎరువుల ఉత్పత్తులను నిలిపివేసినట్లు ఏడీఏ తెలిపారు. ఈ తనిఖీలో రికార్డులు,లైసెన్స్ కాలపరిమితి, బిల్లులను వారు పరిశీలించారు.

మిడ్ టౌన్ రోటరీక్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మిడ్ టౌన్ రోటరీ క్లబ్ నూతన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రోటరీ క్లబ్‌సభా భవనంలో మిడ్ టౌన్ రోటరీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మిడ్ టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, సెక్రటరీ అల్లి తుకారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీతో ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ సాధు గోపాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిడ్ టౌన్ రోటరీ సేవలను విస్తృతం చేస్తామని తెలిపారు. కోటా శివకుమార్, సయ్యద్ రియాజుద్దీన్, రోటేరియన్లు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం లక్ష్యం

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలు చెప్పుకునే విధంగా పులివెందులలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తిరుపతిలో కూడా పులివెందుల తరహాలోనే అభివృద్ధి చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పులివెందులలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న సిటీ ఫారెస్ట్ రాణి తోపు, గరండాల్ వంకను ఆయన పరిశీలించారు. తుడా బీసీ హరికృష్ణ, సెక్రటరీ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.